క్లుప్తంగా

జగనన్నతోనే మహిళా సాధికారత



రామస్వామిపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: మహిళా సాధికారతకు కృషి చేస్తున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడం ప్రతి మహిళ బాధ్యతని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో మహిళలకే ప్రాధాన్యత ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ మహిళ సాధికారత జగనన్నతో సాధ్యమవుతుందన్నారు. మండలంలోని రామస్వామిపేటలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెడుతూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. గడచిన ఐదేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను గుర్తు చేశారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలన్నారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ప్రజాస్వామ్య రక్షణకు ఓటుహక్కు వజ్రాయుధం



ఈవీఎం మోడల్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు మిశ్రా, కలెక్టర్ తదితరులు

రాజానగరం: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును వజ్రాయుధంగా వినియోగించాలని రాష్ట్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు రామ్‌మోహన్ మిశ్రా అన్నారు. జాతీయ రహదారిపై దివాన్ చెరువు జీఓ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన మోడల్ ఈవీఎంను గురువారం ఆయన పరిశీలించారు. అక్కడ ఆగిన ప్రయాణికులను చైతన్య పరుస్తూ ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. ఓటు వేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. అలాగే తూర్పుగానుగూడెంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును కూడా ఎన్నికల పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్, ఆర్డీఓ చైత్రవర్షిణి ఉన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురం శివారున పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై టి.రామకృష్ణ గురువారం తెలిపారు. వారి నుంచి రూ.4,500 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

బాధితుడికి అండగా ఉంటాం

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగానుగూడెంలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన మేడిశెట్టి రామచంద్రరావుకు ప్రభుత్వం తరఫున సాయం అందజేస్తామని తాహసీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ హోటల్ వ్యాపారం నిర్వహిస్తుండగా బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. సుమారు రూ.8 లక్షలు నష్టం కలిగిందని బాధితుడు తెలిపాడన్నారు.

జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శలు




కోటి గ్రామంలో అడపా కనకరాజు తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి


మధురపూడి: వైఎస్సార్ సీపీ కోరుకొండ మండల కన్వీనర్ అడపా కనకరాజును గురువారం పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. ఆయన తల్లి ఇటీవల మృతి చెందారు. తొలుత కనకరాజు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. దోసకాయలపల్లికి చెందిన ముత్యం నాగేశ్వరరావు ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. ఆయనను విజయలక్ష్మి పరామర్శించారు. ఆమె వెంట కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, శ్రీరంగపట్నం సొసైటీ మాజీ అధ్యక్షుడు అడపా కుమార్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సీతా వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు అడపా రాజు, దోసకాయలపల్లి పార్టీ అధ్యక్షుడు కడవల శివ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

సీతానగరం: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముంద్రు శ్రీనివాస్ గురువారం పురుషోత్తపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించి, హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు ఉన్నారు.



ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటున్న ముస్లిం చిన్నారులు



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి స్వీటు తినిపిస్తున్న ముస్లింలు



పందలపాకలో రంజాన్ విశిష్టతను తెలియజేస్తున్న మత గురువు మౌలానా షేక్ గులాం గౌస్ రిజ్వి

భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదినం

- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఉపవాస దీక్షల విరమణ



అనపర్తి ముఖరం మసీదులో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

అనపర్తి: ముస్లింలకు అత్యంత పవిత్రమైన పండగ రంజాన్‌ను ముస్లింలు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లింలు నెల రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలను గురువారం విరమించారు. మసీదులకు చేరుకున్న ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు రంజాన్ విశిష్టతను, ముస్లింలు పాటించాల్సిన నియమాలను వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మసీదుల వద్ద పండగ వాతావరణం కనిపించింది. రంజాన్ పర్వదినం సందర్భంగా మండలంలోని కుతుకులూరు, అనపర్తి బాబానగర్‌లో ముఖరం మసీదు, పాత ఊరులోని అంజుమాన్ నూర్ ఇస్లాం మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు గురువారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయనకు స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక రంజాన్ అని, ఎదుటి వారికి తమ వంతు సాయం అందించాలని చెప్పారు. ప్రతిఒక్కరూ కుల, మత విద్వేషాలకు అతీతంగా పరోపకార గుణాన్ని అలవరచుకోవాలని సూచించారు.

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో ముస్లింలు గురువారం రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలో ప్రధానంగా పెదపూడి, జి.మామిడాడ, పెద్దాడ, రామేశ్వరం, సంపర, రాజుపాలెం తదితర గ్రామాల్లో ముస్లింలు గురువారం ఉదయం మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత గురువులు మాట్లాడుతూ స్నేహానికి, ప్రేమకు రంజాన్ పండగ ప్రతీక అని చెప్పారు.

బిక్కవోలు: రంజాన్ సందర్భంగా మండలంలోని పలు మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మసీదుల వద్ద పేదలకు దానధర్మాలు చేశారు. బిక్కవోలులోని మదీనా మసీదు వద్ద ఇమాన్(గురువు) మహమ్మద్ షజాహద్ అష్రఫి, పందలపాక బిలాల్ మసీదులో మత గురువు మౌలానా షేక్ గులాం గౌస్ రిజ్వి రంజాన్ విశిష్టతను వివరించారు. బలభద్రపురం మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: రంజాన్ వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. సీతానగరంలోని అజీజియా మసీదులో ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఇమామ్ హఫీజ్ ముస్తాక్ మాట్లాడుతూ రంజాన్ అంటే త్యాగాల పండగన్నారు. ఉపవాస దీక్షలతో ప్రతి వ్యక్తిలో దానగుణం, త్యాగనిరతి పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో మోజన్ షేక్ ఉమర్ షరీఫ్, మసీదు సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని పలు మసీదులలో రంజాన్ ప్రార్థనలు జరిగాయి.

సంక్షేమ సారథి జగనన్నను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- పులుగుర్తలో ఎన్నికల ప్రచారం



పులుగుర్తలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: పరిపాలనలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చి అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన సంక్షేమ సారథి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని పులుగుర్తలో ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన సత్తి ఆదిలక్ష్మికి గ్రామంలో మహిళలు అడుగడుగునా మంగళ హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని అన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరాలంటే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, పులుగుర్త, కుతుకులూరు సర్పంచ్‌లు కాకరపర్తి వేణు, గొల్లు హేమతులసి తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్లకు 325 నోటీసులు

కంబాలచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీపై తప్పుడు పోస్టులు పెట్టిన సామాజిక మాధ్యమాల గ్రూప్ అడ్మిన్లకు జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకూ 325 నోటీసులు జారీ చేశామని అందజేశామని ఎస్పీ పి.జగదీష్ గురువారం తెలిపారు. జిల్లా చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు సోషల్ మీడియా సెల్ ప్రారంభించామని, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న వారిపై దాని ద్వారా నిఘా ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయ, మత, కులపరమైన వివిధ సోషల్ మీడియా గ్రూపులను గుర్తించినట్టు తెలిపారు. అయితే తెలుగుదేశం పార్టీ నాయకులకే ఎక్కువ నోటీసులు ఇచ్చారని ప్రచురించిన వార్త పూర్తిగా అవాస్తవమన్నారు. అన్ని పార్టీలకు చెందిన సామాజిక మాధ్యమాల గ్రూప్ అడ్మిన్లకు నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. తప్పుడు వార్తలు ప్రచురించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయరాదని హితవు పలికారు. సోషల్ మీడియాలో వస్తున్న అసభ్యకర, అభ్యంతర, విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, ట్రోలింగ్‌లకు సంబంధించి 94407 96577 వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఇప్పటి వరకూ వైఎస్సార్ సీపీ గ్రూప్ అడ్మిన్లకు 114, టీడీపీ గ్రూప్ అడ్మిన్లకు 83, జనసేనకు 42, బీజేపీకి 6, ఐఎన్‌సీకి 14, క్యాస్ట్ గ్రూప్ అడ్మిన్లకు 41, ఇతరులకు 25 నోటీసులు జారీ చేశామని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సీతానగరం: పురుషోత్తపట్నం బెల్లేహం హౌస్ ఆఫ్ బెడ్ వృద్ధాశ్రమంలో ఉంటున్న సామర్లకోటకు చెందిన కాంతమ్మ (58) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గత నెల 26న గుర్తు తెలియని వ్యక్తులు కాంతమ్మను వృద్ధాశ్రమం వద్ద వదిలి వెళ్లిపోయారు. ఆమె అనారోగ్యంగా ఉండటంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాంతమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆమె బంధువుల వివరాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని ఎస్సై తెలిపారు. కాంతమ్మ వివరాలు తెలిసినవారు 94409 04832, 93979 14952, 94408 36867 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎన్నికల హెల్ప్‌డెస్క్

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో వచ్చే సందేహాల నివృత్తి కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మొదటి అంతస్తులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ డెస్క్ శుక్రవారం నుంచి అందుబాటులోకి వస్తుందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పనిచేస్తుందన్నారు.

చేసిన మేలును గుర్తు చేసి ఓటు అడగండి



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

- గత ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాం
- వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే రాజా దిశానిర్దేశం

రాజానగరం: గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేర్చాం, కనుకనే ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు మనకే ఉందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. గడచిన ఐదేళ్ల జగనన్న పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని, గ్రామాలలో చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ ఓటు అడగాలని పార్టీ కేడర్‌కు సూచించారు. మండలంలోని రాధేయపాలెం, కొత్త తుంగపాడు, పాత తుంగపాడు, శ్రీకృష్ణపట్నం గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో రాధేయపాలెంలో గురువారం సమావేశమయ్యారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గతంలో ప్రజల ఓట్లతో నెగ్గిన ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదన్నారు. అదే జగనన్న ప్రభుత్వంలో నిరంతరం ప్రజలలోనే ఉంటూ సంక్షేమం, అభివృద్ధిలో నియోజకవర్గాన్ని ముందంజలో ఉంచిన తీరును కూడా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి జగన్ ఐదేళ్ల పాలనపై వారి స్పందనను తెలుసుకోవడంతో పాటు మరోసారి వైఎస్సార్ సీపీ విజయానికి తోడ్పడేలా ప్రజలను చైతన్యపర్చాలన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ జగనన్న ప్రభుత్వం ప్రజారంజక పాలనను అందించిందన్నారు. ప్రతి పథకాన్ని ఆడపడచుల పేరునే అందజేస్తూ, మహిళల ఆర్థిక ప్రగతికి చేయూతనిచ్చిందన్నారు. వ్యవసాయం, వైద్య, విద్య రంగాలకు కూడా అధిక ప్రాధాన్యతనిచ్చిన జగనన్న ప్రభుత్వాన్ని మరొకసారి గెలిపిస్తేనే ఈ పథకాలన్నీ కొనసాగుతాయనే విషయాన్ని వివరించాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, కామేశ్వరరావు, కొండపల్లి దుర్గారావు, శివరామకృష్ణ, మరుకుర్తి వెంకటేశ్వరరావు, డి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

మోటార్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి



కరకుదురులో ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: మండలంలోని రామేశ్వరం నుంచి జి.మామిడాడ వరకూ శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ మోటార్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి కోరారు. గురువారం ఆయన కరకుదురు గ్రామంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, పార్టీ శ్రేణులు సమరోత్సాహంతో పని చేయాలన్నారు. కరకుదురులో ఆధునీకరణ పనులు చేపట్టి రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించడానికి కృషి చేసిన మేకా రామకృష్ణ చౌదరిని ప్రత్యేకంగా అభినందించారు. శుక్రవారం జరగనున్న ర్యాలీ ఏపీత్రయం, కరకుదురు, దోమాడ, పెదపూడి, కైకవోలు, శహపురం, కాండ్రేగుల, సంపర, పుట్టకొండ, పెద్దాడ మీదుగా జి.మామిడాడ చేరుకుంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వుండ్రు చంద్రకళ, ఉప సర్పంచ్ తోటకూర లోవరాజు, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ, వుండ్రు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి వాసంశెట్టి మాధవ, ఏలేటి రాజు, మండపల్లి బుల్లిరాజు, కేతా శ్రీను, కోనాల శ్రీనివాసరెడ్డి, ద్వారంపూడి సూర్యనారాయణరెడ్డి, సాంబత్తుల చంటి, గుత్తుల రమణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో జక్కంపూడి గణేష్

- యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్
- వైఎస్సార్ సీపీలో 150 మంది చేరిక

సీతానగరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. సీతానగరంలోని బాబూ జగ్జీవన్‌రామ్‌పేటలో బుధవారం రాత్రి తవిటికి సూర్యారావు, తాళాబత్తుల సూరిబాబు, ఉండుత్తి ప్రకాశం, టి.బాలాజీ, ఎ.ప్రదీప్‌తో పాటు 150 మంది యువత, మహిళలు, పేట పెద్దలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి జక్కంపూడి గణేష్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. జక్కంపూడి కుటుంబం అంతా ప్రజాసేవకు అంకితమైందన్నారు. గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో పాటు తమ కుటుంబసభ్యులు అందరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఎంపీటీసీ వెన్నెల అప్పల నాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కోలా శ్రీను, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మట్టా శ్రీను, వలవల వల్లీ, ఈత వీరబాబు, తోరం బ్రహ్మాజీ, మట్ట మునియ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

అనపర్తి: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గం వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాలు టీడీపీ అధినేత చంద్రబాబుకు అలవాటేనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనే ధైర్యం లేక అధికారం కోసం బీజేపీ, జనసేనతో అనైతిక పొత్తు పెట్టుకున్నారని విమర్శించారు. రెడ్డి సామాజిక వర్గీయులను ద్వేషించే చంద్రబాబు తాను అధికారంలో ఉండగా తన సామాజిక వర్గానికే ప్రాధాన్యమిచ్చారన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉండగా రెడ్లను అన్ని రంగాల్లో అణిచివేశారని, కాల్‌మనీ వ్యవహారంలో రెడ్డి సామాజిక వర్గీయులనే టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ అన్ని సామాజిక వర్గాలకు అండగా నిలిచారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని, ఈ ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గీయులు ప్రత్యేక పాత్ర పోషించాలని ఆయన కోరారు. సమావేశంలో చిర్ల వీర్రాఘవరెడ్డి, వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, వల్లభశెట్టి సతీష్, జీఎల్ రవిశంకర్, కొండేటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ కేతా తులసి తదితరులు

బిక్కవోలు: మహాత్మా జ్యోతిరావు పూలే జాతికి చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం పూలే జయంతిని పురస్కరించుకుని బిక్కవోలు వంతెన వద్ద పూలే విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి పూలే చేసిన కృషి మరువలేనిదని, బాలికా విద్యకు ఆయన ఎంతో ప్రాధాన్యమిచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జంగా వీర సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కిలపర్తి సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు, గొర్రెల రామకృష్ణ, తమ్మిరెడ్డి నాగశ్రీనివాస్ రెడ్డి, సత్తి హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: జ్యోతిరావు పూలేను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ కేతా తులసి అన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో పూలే జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తులసి మాట్లాడుతూ పూలే లాంటి మహనీయులు భారతీయులందరికీ మార్గదర్శకులుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తుల పుష్పవతి, ఎంపీటీసీ సభ్యులు బి.భవానీ, సుందరపల్లి సుధాకర్‌బాబు, వైఎస్సార్ సీపీ పార్లమెంటు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కేతా శ్రీను, మండల కన్వీనర్ గుత్తుల రమణ పాల్గొన్నారు.